# తల్లాడలో పట్టపగలు చోరీ..

## రూ.7 లక్షల బంగారం ఎత్తుకెళ్లిన దుండగులు



**తల్లాడ/, ఏప్రిల్ 8 (జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రం తల్లాడలో పట్టపగలు దొంగలు రెచ్చిపోయారు. గొల్లగూడెంకు వెళ్లే మార్గంలో ఉన్న షేక్ జమాల్ నివాసాన్ని లక్ష్యంగా చేసుకుని బుధవారం మధ్యాహ్నం చోరీకి పాల్పడ్డారు.

ఇంటికి తాళం వేసి పనిమీద బయటకు వెళ్లిన జమాల్ తిరిగి వచ్చేసరికి తలుపు తాళం పగలగొట్టిన ఆనవాళ్లు కనిపించడంతో అప్రమత్తమయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.సమాచారం అందుకున్న ఎస్సై-2 వెంకటేష్ సంఘటన స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. ఇంటిలోని బీరువాలను చెదరగొట్టి సుమారు రూ. 7 లక్షల విలువైన బంగారపు ఆభరణాలతో పాటు రూ. 30 వేల నగదును దొంగలు అపహరించినట్లు బాధితుడు తెలిపారు.పట్టపగలు జరిగిన ఈ చోరీ ఘటన స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

# వేసవిలో దాహార్తి తీర్చే చలివేంద్రం

## మల్లకపల్లిలో బాలవికాస సేవా కార్యక్రమం




**ధర్మసాగర్ /హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 8 (జర్నలిస్ట్ వార్త)** హనుమకొండ జిల్లాధర్మసాగర్ మండలం మల్లకపల్లి గ్రామంలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. మండుతున్న ఎండల్లో బాటసారుల దాహాన్ని తీర్చేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం స్థానికుల ప్రశంసలు అందుకుంది.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ గిన్నారపు లత.మాట్లాడుతూ.వేసవికాలంలో అన్నదానాల కోసం బాటసారుల ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. . బాటపారుల దాహాన్ని తీర్చడం ప్రతి ఒక్కరి బాధ్యత అని సూచించారు. ఇలాంటి సేవా కార్యక్రమాన్ని నిర్వహించిన బాలవికాస సంస్థను ఆమె అభినందించారు.దాతలుగా చైపాక కుమార్, మహేంద్ర సహకారం అందించగా, బాలవికాస్ ప్రతినిధులు అనగోని రజిత, బిల్లా అనిత కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించారు.కార్యక్రమానికి గ్రామ పంచాయతీ కార్యదర్శి అనుపమ, అంగనవాడీ ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామ పెద్దలు, స్థానికులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఇంద్రనగర్‌కు కరెంట్ కష్టాలు

## - స్తంభాలు, వైర్లు కావాలి





**ఎల్కతుర్తి,/ ఏప్రిల్ 8: (జర్నలిస్ట్ వార్త)**మండలంలోని ఇంద్రనగర్ గ్రామపంచాయతీలో కరెంట్ సమస్యలు ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గ్రామ అభివృద్ధిలో భాగంగా వార్డు వారీగా విద్యుత్ లోపాలు ఉన్న నేపథ్యంలో సర్పంచ్ అంబాల రాజకుమార్ ఆధ్వర్యంలో మండల విద్యుత్ శాఖ ఏఈ బాలరాజుకు వినతిపత్రం అందజేశారు.గ్రామంలో విద్యుత్ స్తంభాల కొరత, సరైన సరఫరా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ పేర్కొన్నారు. తక్షణమే కొత్త స్తంభాలు ఏర్పాటు చేసి, అవసరమైన వైర్లు అందించి సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు. ఈ మేరకు రాతపూర్వకంగా విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు.

**కంపోస్ట్ షెడ్‌పై దృష్టి:**గ్రామంలోని కంపోస్ట్ షెడ్‌ను పరిశీలించిన సర్పంచ్, పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా నిల్వ చేసి కంపోస్ట్ ఎరువుగా తయారు చేయాలని సూచించారు. తయారైన ఎరువును రైతులకు అందించి ఉపయోగించుకునేలా చూడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి స్వామి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎసిబికి చిక్కిన మరో ఇద్దరు పోలీసులు

## 2 లక్షలు లంచం తీసుకుంటుండగా పట్టివేత



**హైదరాబాద్,ఏప్రిల్8(ఆర్ఎన్ఎ):** అవినీతి నిరోధక శాఖ అధికారులు మరో ఇద్దరు ప్రభుత్వ అధికారులు చిక్కారు. ఉదయం మహబూబాబాద్ మండలం గూడురు గ్రామంలో ఎంఈవో, స్కూల్ అసిస్టెంట్ లంచం తీసుకుంటూ పట్టుబడగా తాజాగా శంషాబాద్ పరిధిరో సర్కిల్ ఇన్స్‌పెక్టర్, సబ్ ఇన్స్‌పెక్టర్ ఏసీబీ వలకు చిక్కారు. శంషాబాద్ పరిధిలోని రాజీవ్‌గాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన కేసులో అరెస్టు చేయకుండా కేసు నుంచి తప్పించడానికి లంచం తీసుకున్న ఇద్దరు పోలీసు అధికారులను ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. రాజీవ్ గాంధీ విమానశ్రయం పోలీసు అవుట్ పోస్టులో సీఐగా పనిచేస్తున్న యూ.కె సిద్దేశ్వర్, ఎస్సై సంపతి కనకయ్య రూ. 2 లక్షలు తీసుకుంటుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఓ కేసులో చార్జిషీట్, అరెస్టు చేయకుండా చూడాలని బాధితుడు కోరగా వారు రూ. 5 లక్షలు డిమాండ్ చేశారు. ఇందులో మొదటి విడతగా రూ.2 లక్షలు ఒప్పందం జరిగి లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ఇద్దరిని అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో హాజరు పరిచారు.

# నిజాయితీ డీలర్‌కు డిప్యూటీ కలెక్టర్ ప్రశంసలు



**కల్లూరు/, ఏప్రిల్ 8 (జర్నలిస్ట్ వార్త):** మండలంలోని చెన్నూరు గ్రామ రేషన్ దుకాణాన్ని డిప్యూటీ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రేషన్ బియ్యం నిల్వలు, పంపిణీ రికార్డులను పరిశీలించిన ఆయన అన్ని వివరాలు సక్రమంగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. రికార్డులు పారదర్శకంగా నిర్వహిస్తున్న డీలర్ అమలను అభినందించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలకు రేషన్ సరుకులు సమయానికి, పూర్తిస్థాయిలో అందేలా చూడటం అధికారుల బాధ్యత అని స్పష్టం చేశారు. మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేసే ప్రక్రియలో ఎక్కడైనా అక్రమాలు జరిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.తనిఖీలలో రెవెన్యూ విజిలెన్స్ సిబ్బంది పాల్గొన్నారు.

# హెల్త్ సబ్ సెంటర్లకు డస్ట్ బిన్స్ అందజేత



**వైరా/, ఏప్రిల్ 8 (జర్నలిస్ట్ వార్త):** వైరా మున్సిపాలిటీ పరిధిలో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇస్తూ చైర్మన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఎస్బిఐ ఫౌండేషన్ సహకారంతో గండగలపాడు, బ్రాహ్మణపల్లి హెల్త్ సబ్ సెంటర్లకు డస్ట్ బిన్స్ అందజేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యానికి పరిశుభ్రమైన వాతావరణం అత్యంత అవసరమని, హెల్త్ సబ్ సెంటర్ల వద్ద చెత్త నిర్వహణ సక్రమంగా ఉండేందుకు ఈ డస్ట్ బిన్స్ ఉపయోగపడతాయని తెలిపారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారం కూడా అవసరమని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో లయన్స్ ఐ హాస్పిటల్ నిర్వాహకులు ఉంద్రు శ్యాంబాబు, హాస్పిటల్ సిబ్బంది, మున్సిపాలిటీ సిబ్బంది రామకృష్ణ, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ఎండల వేడిలో ఊరట..

## ధర్మసాగర్‌లో చల్లని నీటి చలివేంద్రం సర్పంచ్ జ్యోతి






**ధర్మసాగర్,/హనుమకొండ బ్యూరో ఏప్రిల్ 8 (జర్నలిస్ట్ వార్త):** మండుతున్న ఎండలతో అలమటిస్తున్న ప్రజలకు ఉపశమనం కలిగించేలా ధర్మసాగర్ గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశారు. బుధవారం గ్రామ పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాన్ని సర్పంచ్ జ్యోతిఏలీయా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని గ్రామస్థులు, ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఈ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామం గుండా రాకపోకలు సాగించే వారందరికీ ప్రతి రోజు చల్లటి త్రాగునీరు అందుబాటులో ఉంచుతామని పేర్కొన్నారు. ప్రజలు ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.చలివేంద్రం వద్దకు వచ్చే ప్రతి ఒక్కరికీ త్రాగునీరు అందించేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కొమురమ్మ, ఎంపీడీవో అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్ కుమార్, కారోబర్ మహేందర్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# పర్మినెన్సీ కోసం విద్యుత్ కార్మికుల సమ్మెకు టి యు సి ఐ మద్దతు



**తల్లాడ,/ ఏప్రిల్ 8: (జర్నలిస్ట్ వార్త)** విద్యుత్ రంగంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న సమ్మెకు ట్రేడ్ యూనియన్ ఆఫ్ ఇండియా (టి యు సి ఐ) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యుత్ కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేయకపోవడాన్ని టి యు సి ఐ ఖమ్మం జిల్లా సహాయక కార్యదర్శి డి. శ్రీనివాసరావు తీవ్రంగా విమర్శించారు.ఈ నెల 8వ తేదీ నుంచి ప్రారంభమైన సమ్మెలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 23 వేల మంది కాంట్రాక్టు కార్మికులు పాల్గొంటున్నారని తెలిపారు. ఆర్డినెన్సుల రూపంలో కార్మికులను నియంత్రించే ప్రయత్నాలను వ్యతిరేకిస్తూ ఈ సమ్మె కొనసాగుతోందన్నారు.వేసవికాలంలో విద్యుత్ డిమాండ్ అధికంగా ఉండే సమయంలో కార్మికులు సమ్మెకు దిగడం రాష్ట్రానికి తీవ్ర ఇబ్బందులు కలిగించే అవకాశముందని పేర్కొన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం తక్షణమే స్పందించి, రెగ్యులర్ ఉద్యోగులకు వర్తించే నిబంధనలను కాంట్రాక్టు కార్మికులకు కూడా అమలు చేయాలని డిమాండ్ చేశారు.లేదంటే ఇతర రంగాల కార్మికులను కూడా ఉద్యమంలోకి తీసుకువచ్చి సంఘీభావ పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్మిక వ్యతిరేక విధానాలను ప్రభుత్వం విరమించుకుని సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు.

# పాల డెయిరీ సంఘంతో మహిళలకు ఆర్థిక బలం

## వంగర గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్





**భీమదేవరపల్లి/ఏప్రిల్ 8(జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం వంగర గ్రామంలో మహిళా పాల డెయిరీ 2 సంఘం సొంత భవన నిర్మాణానికి బుధవారం భూమి పూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వంగర గ్రామ సర్పంచ్ గజ్జల సృజన రమేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలోని మహిళల ఆర్థికాభివృద్ధికి మహిళా పాల డెయిరీ సంఘాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలపడేందుకు ఇలాంటి సంఘాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మహిళా పాల డెయిరీ సంఘానికి సొంత భవనం నిర్మాణం కావడం గ్రామ అభివృద్ధికి మంచి సూచికగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వొల్లాల రమేష్, వార్డు సభ్యులు మారం సతీష్, గజ్జల రమేష్, సూపర్వైజర్ వసంత, సంఘం కార్యవర్గ సభ్యులు కాల్వ సునీత, గౌరవేణి భాగ్య, ఆషాడపు లక్ష్మి, నీలం శోభ, మర్రి రాజమ్మ, బల్ల లావణ్య, బల్ల శ్రీదేవి, ఘనకులు రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. అలాగే గ్రామస్తులు కాల్వ సంపత్, వెంగళ నారాయణ, ఏనుక శ్రీనివాస్, నల్లగోని రమేష్, నీలం బిక్షపతి, మర్రి రవి, మర్రి దొడ్డయ్య తదితరులు పాల్గొన్నారు

# మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం





**సింగపురం ఇమ్మానియేల్ రాజ్**

**స్టేషన్ ఘన్పూర్/ ఏప్రిల్ 8 (జర్నలిస్ట్ వార్త):** మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తామని స్టేషన్ఘన్పూర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి సింగపురం ఇందిరా తనయుడు కాంగ్రెస్ యువ నాయకుడు సింగపురం ఇమ్మానియేల్ రాజ్ అన్నారు. బుధ వారం ధర్మసాగర్ మండలం ధర్మపురం గ్రామానికి చెందిన తంపుల రాజేందర్ ఇటీవల మరణించిన విషయం తెలుసుకొని వారి చిత్రపటానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగడ సానుభూతిని తెలియజేసి,మృతుల కుటుంబాలకు అండగా నిలుస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వడ్లూరి మౌనిక , జిల్లా ఎస్సీ సెల్ ఉపాధ్యక్షులు సింగపురం నాగయ్య, జిల్లా ఎస్సీ సెల్ కన్వీనర్ జీడి కోర్నెల్ ,ధర్మపురం మాజీ సర్పంచ్ గొట్టం రవయ్య ,గ్రామఉపసర్పంచ్ గొట్టం రవివర్మ,గొట్టం శ్రీనివాస్, బైరపాక దివాకర్, సురేందర్ రెడ్డి ,బరిగెల దయాకర్ , బరిగెల రాజు, బరిగె ల సుధాకర్ ,బైరపాక సుమన్ ,ప్రసాద్ ,రవీందర్ , వార్డ్ మెంబర్ కుక్కల సిద్దు, గొట్టం రమేష్ ,బిసి సెల్ నాయకులు తాటికొండ సంపత్ కుమార్, చిల్పూరు మండల యూత్ వైస్ ప్రెసిడెంట్ చాగం టి మణీ ,సింగపురం ప్రతిష్ తదితరులు పాల్గొ న్నారు.

# పరీక్షల పర్యవేక్షణలో డిసిఇబి చైర్మన్





**రాయపర్తి/ఏప్రిల్ 8: (జర్నలిస్ట్ వార్త);** మండలంలోని పాఠశాలల్లో జరుగుతున్న సమ్మేటివ్ అసెస్మెంట్-2 పరీక్షలను డిసిఇబి చైర్మన్, ఉమ్మడి వరంగల్ జిల్లా పరీక్షల కార్యదర్శి గారే కృష్ణమూర్తి బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తీర్మలాయపల్లి గ్రామంలోని కేజీబీవీ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొండూరు గ్రామంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలను సందర్శించారు. పరీక్షలు సక్రమంగా జరుగుతున్న తీరును పరిశీలించిన ఆయన, విద్యార్థులు అందరూ తప్పనిసరిగా పరీక్షలకు హాజరై తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు. పరీక్షలు రాయడం ద్వారా విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం, రాత నైపుణ్యాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలను కచ్చితంగా నిర్వహించాలని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులకు సూచించారు. పరీక్షలు పూర్తైన వెంటనే జవాబు పత్రాల మూల్యాంకనం చేపట్టి, వేసవి సెలవులకు ముందుగానే విద్యార్థులకు ప్రగతి పత్రాలు అందజేయాలని ఆదేశించారు.

ఈ తనిఖీలలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ కవిత, జడ్పిహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి, పీఎం శ్రీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మలత, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

# ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌లో సీపీ ఆకస్మిక తనిఖీ

## పనితీరుతో ప్రజలకు చేరువ కావాలి: పోలీసులకు సీపీ సూచనలు







**భీమదేవరపల్లి/ఏప్రిల్8 (జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ పోలీస్ స్టేషన్‌ను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం పోలీస్ అధికారులు, సిబ్బంది పనితీరును ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణ ప్రజల్లో సైబర్ నేరాలపై అవగాహన పెంపొందించడంతో పాటు డ్రగ్స్ వినియోగాన్ని అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే "అరైవ్ అలైవ్" కార్యక్రమం ద్వారా ట్రాఫిక్ నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్టేషన్ రికార్డులను పరిశీలించిన సీపీ గ్రామాల హిస్టరీ షీట్లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. అధికారులు, సిబ్బంది గ్రామాల పర్యటనలను తరచుగా నిర్వహిస్తూ ప్రజలకు చేరువ కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ దార కవిత, కాజీపేట ఏసీపీ ప్రశాంత్ రెడ్డి, ఎల్కతుర్తి సీఐ పులి రమేష్, ఎస్ఐ రాజు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమిలో మట్టి దోపిడీ

## జేసీబీ, 6 ట్రాక్టర్లు సీజ్

### ఏడుగురిపై కేసు నమోదు చేసిన గీసుగొండ పోలీసులు



**గీసుగొండ/ఏప్రిల్ 8(జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలోని చంద్రయ్యపల్లి గ్రామ శివారులో అక్రమంగా మట్టి తరలిస్తున్న ముఠాపై పోలీసులు కొరడా ఝుళిపించారు. ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూమి నుండి మట్టిని తవ్వుతున్న ఒక జేసీబీతో పాటు, ఆరు ట్రాక్టర్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. చంద్రయ్యపల్లి శివారులోని ప్రభుత్వ భూమిలో జేసీబీ సహాయంతో మట్టిని తవ్వి ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీనిపై తక్షణమే స్పందించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. అనుమతి పత్రాలు చూపకపోవడంతో రవాణాకు ఉపయోగిస్తున్న వాహనాలను సీజ్ చేసి స్టేషన్‌కు తరలించారు. మట్టి అక్రమ రవాణాకు పాల్పడుతున్న ఏడుగురు వ్యక్తులపై గీసుగొండ పోలీసులు కేసు నమోదు చేశారు. నిందితుల వివరాలు ఇలా ఉన్నాయి

గండికోట సతీష్ (మనుగొండ)
గాడుదుల రాజకుమార్ (మనుగొండ)
గాడుదుల శ్రావన్ కుమార్ (నర్సంపేట)
కుప్పాల శ్రీనివాస్ (చంద్రయ్యపల్లి)
కుప్పాల అజయ్ (చంద్రయ్యపల్లి)
తోట పరశురాములు (మనుగొండ)
గాడుదుల బాలారాజు (మనుగొండ)

ప్రభుత్వ అనుమతి లేకుండా మట్టి, ఇసుక వంటి సహజ వనరులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గీసుగొండ ఇన్‌స్పెక్టర్ డి.విశ్వేశ్వర్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రభుత్వ భూములను కాపాడటంలో ప్రజలు కూడా పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.





# విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ లు పంపిణీ చేసిన గద్దె అనిల్ కుమార్



**స్టేషన్ ఘన్పూర్/ ఏప్రిల్ 8 (జర్నలిస్ట్ వార్త) :** చిల్పూర్ మండలంలోని రాజవరం హై స్కూల్ విద్యార్థులకు స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ లీగల్ సెల్ కన్వీనర్ గద్దే అనిల్ కుమార్ ఎగ్జామ్స్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గద్దె అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థిని విద్యార్థులు మంచి మార్కులు సాధించి తల్లిదండ్రులకు, పాఠశాలకు మంచి పేరు ప్రఖ్యాతలు తేవాలని అన్నారు. విద్యార్థులను చదువులో ప్రోత్సహించడానికి ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు.రాజవరం హై స్కూల్ 50 మంది విద్యార్థులకు ఎగ్జామ్స్ కిట్ ను పంపిణీ చేసినట్లు గద్దే అనిల్ కుమార్ తెలిపారు. ఎగ్జామ్ కిట్స్ అందజేసిన గద్దె అనిల్ కుమార్ ను పాఠశాల యాజమాన్యం , విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ డేవిడ్ కొమురయ్య, . ఆకుల శ్రీకాంత్, ఉపాధ్యాయులు శ్రీదేవి, పద్మదేవి, సోమేశ్వర్ పీఈటి అన్నెపు కుమార్,అటెండర్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

# కార్పొరేట్‌కు పోటీగా ప్రభుత్వ పాఠశాలలు

## బాడిబాట కార్యక్రమంలో అధికారులు పిలుపు




**రాయపర్తి/ఏప్రిల్ 8:( జర్నలిస్ట్ వార్త);** కార్పొరేట్ పాఠశాలలకు ఏమాత్రం తగ్గకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందుతున్నదని మండల విద్యాశాఖ అధికారి వెన్నంపల్లి శ్రీనివాస్, సర్పంచ్ గారే సాహెంద్రబిక్షపతి తెలిపారు. మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయుడు సతీష్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'బాడిబాట' కార్యక్రమంలో వారు పాల్గొని వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లేలా అభివృద్ధి చేస్తున్నదని పేర్కొన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకుంటే ఉజ్వలభవిష్యత్తు సాధ్యమవుతుందని సూచించారు. ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ఇటీవల గురుకుల పాఠశాలలో సీట్లు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ కృష్ణమూర్తి, రిటైర్డ్ హెడ్‌మాస్టర్ రావుల భాస్కర్ రావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# రాయపర్తి అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం : సర్పంచ్



**రాయపర్తి/ఏప్రిల్ 8: (జర్నలిస్ట్ వార్త);** గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని సర్పంచ్ గారే సాహెంద్రబిక్షపతి స్పష్టం చేశారు. మండల కేంద్రంలోని 9వ వార్డులో బుధవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వామ్యం ఎంతో కీలకమని పేర్కొన్నారు. గ్రామాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేయడానికి కృషి కొనసాగుతున్నదని తెలిపారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సహకారంతో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ సీసీ రోడ్డు నిర్మాణాన్ని చేపట్టినట్లు చెప్పారు. గ్రామంలో మౌలిక సదుపాయాల మెరుగుదలకు మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వల్లే వినోద్ కుమార్, ఉపసర్పంచ్ మచ్చ రమేష్, వార్డు సభ్యులు నూనెపిరని రాజబాబు, గారే కళ్యాణి విష్ణు, కుంట రాజు, కుంట రాంబాబు, కాంగ్రెస్ నాయకులు కోతి వీరన్న, మల్యాల నర్సింహామూర్తి, శంకర్, గణేష్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి బీఆర్ఎస్ ఆర్థిక సాయం




**రాయపర్తి/ ఏప్రిల్ 8(జర్నలిస్ట్ వార్త);** మండలంలోని మైలారం గ్రామానికి చెందిన లేతాకుల దేవి అనారోగ్యంతో హనుమకొండలోని ఓజాస్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, బీఆర్ఎస్ నాయకులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్, పార్టీ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్ రెడ్డి పంపించిన రూ.11 వేల ఆర్థిక సహాయాన్ని బీఆర్ఎస్ నాయకుడు లేతాకుల రంగారెడ్డి చేతుల మీదుగా కుటుంబానికి అందజేశారు. బాధిత కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధికార ప్రతినిధి తాళ్లపెల్లి సంతోష్ గౌడ్, చందు రామ్, సంకినేని ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

